రేషన్‌కార్డుదారులకు.. ఈకేవైసీ కష్టాలు!

- సడన్‌గా ప్రకటించిన ప్రభుత్వం
- దూరప్రాంతాల్లో ఉన్నవారికి ఇబ్బందులు
- గడువు పెంచాలని విజ్ఞప్తి



కవిటిలో ఎండీయూ వాహనం వద్ద ఈకేవైసీ వేస్తున్న లబ్ధిదారులు

కవిటి: మండువేసవిలో రేషన్ లబ్ధిదారులకు కూటమి సర్కార్ కష్టాలు తెచ్చిపెట్టింది. రేషన్‌కార్డులో పేర్లు ఉండి ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు ఈ నెలాఖరులోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సడన్‌గా ప్రకటించింది. దీంతో వివిధ కారణాలతో బయోమెట్రిక్ పెండింగ్ ఉన్నవారు ఆందోళన చెందుతున్నారు. బతుకు తెరువు కోసం దూరప్రాంతాల్లో ఉంటూ ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు అనేక కష్టాలుపడుతూ స్వగ్రామాలకు వస్తున్నారు. డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లను సంప్రదిస్తున్నారు. అయితే చాలాచోట్ల సర్వర్ పనిచేయకపోవడంతో ఈ ప్రక్రియ ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మందకొడిగా సాగుతుంది. ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీ పూర్తి చేసుకోకపోతే వచ్చే నెల నుంచి రేషన్ ఇవ్వరనే భయాన్ని చాలామంది వ్యక్తం చేస్తున్నారు. ఈకేవైసీ పెండింగ్ ఉన్న విషయం చాలామంది లబ్ధిదారులకు ఇప్పటికీ తెలియదు. వారికి డీలర్లు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది నుంచి ఎలాంటి సమాచారం కూడా చేరలేదు. ఇలాంటి పరిస్థితిలో ఈకేవైసీ గడువును పెంచాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ఈ కేవైసీ ప్రక్రియ ఇలా..

మండలం	మొత్తం యూనిట్స్	ఈకేవైసీ పూర్తి..	ఈకేవైసీ పెండింగ్
కవిటి	72,177	65,812	6,365
కంచిలి	62,793	56,087	6,706
సోంపేట	71,646	64,901	6,745
ఇచ్ఛాపురం	86,492	77,251	9,241



కవిటిలో ఇంటివద్దకు వెళ్లి పెండింగ్ ఉన్న లబ్ధిదారుని ఈకేవైసీ తీసుకుంటున్న డీలర్

31వ తేదీ వరకే గడువు..



రేషన్‌కార్డులో పేరు ఉండి ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు ఈ నెల 31వ తేదీలోగా ఈ ప్రక్రియను పూర్తి చేయించుకోవాలి. చేయించుకోకపోతే వారిపేరును కార్డు నుంచి తొలగించడంతో పాటు నిత్యావసర సరుకులు పంపిణీ నిలిపివేయాల్సి వస్తుంది. ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారు సత్వరమే తమ డీలర్ లేదా సంబంధిత సిబ్బందిని సంప్రదించాలి. – బి మురళీమోహన్‌రావు, తహసీల్దార్, కవిటి మండలం

రోడ్డుపైకి మురుగు..



మండల కేంద్రం మందసలోని ప్రధాన వీధిలో ఉన్న కాలువలో పూడికలు పేరుకుపోయాయి. దీంతో మురుగునీరు రోడ్డుపైకి వస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దోమలు, ఈగలు విజృంభిస్తుండడంతో జ్వరాలబారిన పడుతున్నామంటున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కాలువలో పూడికలను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – మందస

మంచినీరు వృథా..



మండు వేసవిలో ఒక వైపు ప్రజలు మంచినీటికి కటకటలాడుతున్నారు. అయితే మరోవైపు అధికారుల అలసత్వం కారణంగా ఉద్దానం ప్రాజెక్టు, జలజీవన్ మిషన్ ద్వారా ఇచ్ఛాపురం మండలం కొళిగాం గ్రామానికి సరఫరా అవుతున్న శుద్ధ జలాలు లీకేజీలతో వృథాగా రోడ్డు పాలవుతోంది. దీనిపై స్థానిక సర్పంచ్ సంతోష్ మండలా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా గ్రామీణ నీటిపారుదల శాఖాధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. – ఇచ్ఛాపురం రూరల్

బాధిత కుటుంబానికి సాయం



మండల కేంద్రం కంచిలి పంచాయతీ పరిధి బలియాపుట్టుగ కాలనీకి చెందిన రీనా బెహరా ఇల్లు ఇటీవల కాలిపోయింది. దీంతో సర్వసం కోల్పోయారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థులు బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. పది వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని రీనా బెహరాకు పాఠశాల కరస్పాండెంట్ సీహెచ్ ఆదినారాయణ, ప్రిన్సిపాల్ ఉమా, విద్యార్థుల చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సునీల్ రాథోడ్ పాల్గొన్నారు. – కంచిలి

క్లుప్తంగా

సర్పంచ్‌కు వైఎస్సార్‌సీపీ నాయకుల పరామర్శ



బాలకృష్ణను పరామర్శిస్తున్న తిలక్ తదితరులు

టెక్కలి: రావివలస పంచాయతీ సర్పంచ్ సర్లాన బాలకృష్ణ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్‌తో పాటు నాయకులు బుధవారం రావివలస వెళ్లి బాలకృష్ణను పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు హెచ్.వెంకటేశ్వరరావు, నాయకులు ఎస్.సుధాకర్, టి.కిరణ్, చిన్ని జోగారావు, పి.వైకుంఠరావు ఉన్నారు.

రూ. 37.47 లక్షలకు ఆశీల్ల వేలం పాట ఖరారు

ఇచ్ఛాపురం టౌన్: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఆశీలు వసూళ్ల కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వేలం పాటను అధికారులు నిర్వహించారు. ఆశీళ్ల వసూళ్లతోపాటు లైబ్రరీలో పాతపుస్తకాలు, జంతువధ శాల, ప్రభుత్వ స్థలాల్లోని కొబ్బరిచెట్ల ఫలసాయం కోసం పలువురు పోటీపడ్డారు. మొత్తం 37,47,570 రూపాయలకు ఖరారైనట్టు మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ వెల్లడించారు. రోజువారీమార్కెట్, వీధిగుత్త ఆశీళ్ల వసూళ్లను కె.రాజు అనే వ్యక్తి 28,44,980 రూపాయలకు దక్కించుకున్నట్టు పేర్కొన్నారు.

కీబోర్డు కళాకారుడుకి గుర్తింపు



నీలాద్రి రెడ్డి

ఇచ్ఛాపురం రూరల్: టి.బరంపురం పంచాయతీ జైపూర్ కొత్తూరు గ్రామానికి చెందిన కీబోర్డు కళాకారుడు మచ్చ నీలాద్రిరెడ్డికి గుర్తింపు లభించింది. హైదరాబాద్‌కు చెందిన మెగా హెల్పింగ్ ఫౌండేషన్ ఇతనికి నంది అవార్డును ప్రకటిస్తూ బుధవారం సమాచారం ఇచ్చింది. కీ బోర్డు, హార్మోనియంలో అసమాన ప్రతిభ కనబర్చినందుకు అవార్డుకు ఎంపిక చేశారు. ఈనెల 28న హైదరాబాద్‌లోని బి.ఎం.బిర్లా సైన్స్ మ్యూజియం పక్కన ఉన్న భాస్కర ఆడిటోరియంలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమంలో నీలాద్రిరెడ్డికి అవార్డును ప్రదానం చేయనున్నారు.

శక్తియాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలాస: ఆపదలో ఉన్న మహిళలకు ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ ఎంతో మేలు చేస్తుందని శక్తి టీం ఎస్ఐ జి.రాజేష్ చెప్పారు. బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. యాప్‌ను సెల్‌లో ఎలా డౌన్‌లోడ్ చేసుకోవాలో వివరించారు. చెడు వ్యసనాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. పాఠశాల హెచ్ఎం ఎస్వీ రమణరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఈశ్వరరావు, కొయ్యల శ్రీనివాసరావు, సుధాకుమారి, చంద్రశేఖర్, శివప్రసాద్, రజనీకుమారి పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై సమగ్ర దర్యాప్తు చేయాలి



మాట్లాడుతున్న అన్వేష్

ఇచ్ఛాపురం: రాజమండ్రి సమీపంలో ఈనెల 25వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రముఖ పాస్టర్ ప్రవీణ్‌కుమార్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రత్తి అన్వేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇచ్ఛాపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో క్రైస్తవులపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో ప్రవీణ్‌కుమార్ మృతిపై రాష్ట్రవ్యాప్తంగా క్రైస్తవ సంఘాలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మతసామరస్యం కలిగించేలా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పాస్టర్లు బిమ్మోబెహర, ఎలియా, సుందరరావు ఉన్నారు.

గృహ గ్రీవెన్స్‌కు తొమ్మిది దరఖాస్తులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో కమిషనర్ నడిపేన రామారావు ఆధ్వర్యంలో బుధవారం అర్బన్ హౌసింగ్ గ్రీవెన్స్‌సెల్ నిర్వహించారు. టిడ్కో ఇళ్ల స్థలాలు, ఇళ్లు కేటాయించాలని కోరుతూ తొమ్మిది దరఖాస్తులు వచ్చినట్టు తెలిపారు.

కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: వేసవిని దృష్టిలో పెట్టుకొని వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు ఇబ్బంది లేకుండా యజమాన్యాలు సదుపాయాలు కల్పించాలని కార్మిక శాఖాధికారి ఎం.విజయ్‌కుమార్ అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జూన్ వరకు ఎండలు,వేడి గాలులు, వడగాడ్పులతో వడదెబ్బలు తగిలే ప్రమాదం ఉందన్నారు. పని చేసే చోట నీరు, ఓఆర్ఎస్, మజ్జిగ, ప్రథమ చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- టెక్కలి నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కృష్ణదాస్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్

టెక్కలి: అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని నమ్మబలికి.. అధికారం చేపట్టిన తరువాత ప్రజలను కూటమి సర్కార్ మోసం చేసిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో కొద్ది నెలల్లోనే తీవ్రమైన వ్యతిరేకత నెలకుందని చెప్పారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై ఉందన్నారు. టెక్కలిలోని పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుల సమావేశానికి కృష్ణదాస్ హాజరై దిశానిర్దేశం చేశారు. ఒక వైపు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని.. మరో వైపు పన్నుల రూపంలో ప్రజల నుంచి డబ్బులు దోచేస్తున్నారని మండిపడ్డారు. అంతే కాకుండా వివిధ సర్వేల పేరుతో సంక్షేమ పథకాల్లో కోత విధించేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజలకు అండగా పోరాటం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కృష్ణదాస్ అన్నారు. అలాగే పార్టీ మండల స్థాయి కమిటీల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే జిల్లా, అనుబంధ విభాగాల కమిటీలు పూర్తి చేసినట్టు పేర్కొన్నారు. నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులంతా మండలస్థాయి కమిటీల ఏర్పాటుపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మాట్లాడుతూ.. కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించి వారికి న్యాయం జరిగే విధంగా చూస్తామని భరోసానిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీ కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నియోజకవర్గస్థాయి వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు ఎ.రాహుల్, పి.మోహన్, ఎం.గణపతిరావు, ఎల్.బాలకృష్ణ, ఎం.శంకర్, యు.తమ్మయ్య, చిన్ని జోగారావు, డి.ధర్మారావు, ఎస్.జనార్దన్, పి.కరుణాకర్, వాకాడ శ్రీధర్‌రెడ్డి, ఎ.మహేష్, బి.దివాకర్, పి.వైకుంఠరావు, బి.గున్నయ్య, బి.రాకేష్, పి.శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

టెక్కలి: తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని సంఘ అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శి పి.శ్రీనివాసరావు, కె.రాజేశ్వర్రావు, వెంకటరమణ కోరారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. థర్డ్‌పార్టీకి కాంట్రాక్ట్ ఇవ్వకుండా ప్రభుత్వమే నేరుగా సర్వీసులను కొనసాగించాలన్నారు. అలాగే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఆరంభం నుంచి ఉన్నటువంటి వేతనాలనే నేటికీ కొనసాగిస్తున్నారని పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అరబిందో కంపెనీకి ఇచ్చిన కాంట్రాక్ట్ ఈ నెల 31తో ముగుస్తున్నందున.. ఆ తరువాత ప్రభుత్వమే నేరుగా కొనసాగించాలని కోరారు.

జాబ్‌మేళాలో 53 మంది ఎంపిక

పలాస: పలాస మండల వెలుగు కార్యాలయంలో బ్లూస్టార్, యూనికాం, ఫిజయస్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు జాబ్ మేళాను బుధవారం నిర్వహించారు. 72 మంది హాజరవ్వగా.. వీరిలో 53 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు అధికారులు తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొన్న స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ.. యువత ఖాళీగా ఉండకుండా ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు జేడీ ఎం.ఎస్.రమణమూర్తి, టీపీ ట్రైనర్ కె.కవిత, జేసీవో నాగేశ్వరరావు, బ్లూస్టార్ హెచ్ఆర్ రాజు, శ్రీనివాససాహు, ఎంఎంఎస్ అధ్యక్షురాలు జి.శాంతమ్మ, కార్యదర్శి పార్వతి, ఏపీఎం జాంబవతి, మున్సిపల్ కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, పి.విఠల్‌రావు, కుత్తుం లక్ష్మణకుమార్ పాల్గొన్నారు.

ఉద్యాన వన పంటలపై అవగాహన



జీడి పంటపై అవగాహన కల్పిస్తున్న ఉద్యానవన శాఖ అధికారులు

పలాస: ఉద్యానవన పంటల సాగుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానవన శాఖ అధికారులు అన్నారు. పలాసలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో రెండు రోజులుగా నిర్వహించిన జిల్లా స్థాయి ఉద్యాన పంటల రైతుల సదస్సు బుధవారంతో ముగిసింది. ఉద్దానం ప్రాంతానికి చెందిన వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కవిటి, సోంపేట మండలాలకు చెందిన 150 మంది రైతులు రణస్థలం, లావేరు, పొందూరు తదితర మండలాల్లో క్షేత్ర పర్యటన చేశారు. అక్కడ ఉద్యాన పంటలైన కొబ్బరి, జీడి, కొబ్బరి, జీడి తోటల్లో అంతర పంటలు గురించి వివరించారు. బొప్పాయి. అరటి, కాయగూరలు పంటల వల్ల ఎక్కువ లాభాలు ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా కొబ్బరిలో అంతరపంటగా కోకో సాగు చాలా బాగుందని రైతులకు చూపించారు. జీడి పంట సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉద్దానం రైతు సంఘం సీఈవో భాగ్యలక్ష్మి, పలాస ఉద్యానవన శాఖాధికారి సీహెచ్ శంకర్‌దాస్, ఉద్యానవన సహాయకులు శ్రీరాములు, తులసీరావు పాల్గొన్నారు.

పోర్టు వాహనాల అడ్డగింత



ఇతర ప్రాంత వాహన డ్రైవర్లతో చర్చిస్తున్న అసోసియేషన్ సభ్యులు

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం కొత్తపేట గ్రామ సమీపంలో బుధవారం పోర్టు వాహనాలను స్థానిక టిప్పర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కేశవరావు ఆధ్వర్యంలో వాహనదారులు అడ్డుకున్నారు. పోర్టు పనుల్లో స్థానిక వాహనాలు వినియోగించకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వాహనాలు వినియోగించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. లక్షలాది రూపాయలు వెచ్చించి వాహనాలు కోనుగోలు చేస్తే.. తమకు ఉపాధి కల్పించకుండా బయట వ్యక్తులకు లబ్ధి చేకూర్చడం తగదని వాపోయారు. ఇదే విషయమై పలుమార్లు ప్రజాప్రతినిధులు, పోర్టు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకపోవడంతో చివరకు వాహనాలను అడ్డగించాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైన స్థానిక వాహనాలను వినియోగించి ఈ ప్రాంతం ప్రజలకు ఉపాధి కల్పించాలని, అప్పటి వరకు గ్రావెల్, ఇసుక రవాణాలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.

మా కళాశాలలో చేరండంటూ ప్రచారం



టెన్త్ పరీక్ష రాసివస్తున్న విద్యార్థులతో మాట్లాడుతున్న కళాశాల సిబ్బంది

కంచిలి: తమ కళాశాలలో చేరండి అంటూ కంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల్లో లక్షలాది రూపాయలు ఫీజులు ఇచ్చి తల్లిదండ్రులకు ఆర్థిక భారం తేవొద్దని, ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటివి, నిష్ణాతులైన అధ్యాపకులతో బోధించే ప్రభుత్వ కళాశాలలో చేరి ఉన్నత భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని పదో తరగతి పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులకు, వారి ఇళ్లకు వెళ్లి మరీ అవగాహన కల్పిస్తున్నారు.

మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ

కాశీబుగ్గ: పలాస సామాజిక ఆస్పత్రి ఆవరణలో 108 వాహన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈఎంటీలకు యునైటెడ్ కింగ్డమ్ మాడ్యుల్‌కు అనుగుణంగా శిక్షణ ఇచ్చారు. జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఓఈ జగన్నాథరావు, ఆన్ జాబ్ ట్రైనర్ నెయ్యిల కృష్ణ ఉన్నారు.

సారాకు దూరంగా ఉండాలి

సోంపేట: సారాకు ప్రజలు దూరంగా ఉండాలని ఎక్సైజ్ సీఐ కె.బేబి అన్నారు. ఎం.జి.పురం పంచాయతీలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాతుపురం, మాలగోవిందపురం, పైడిగాం, కొరంజిభద్ర గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి సారా తాగితే వాటిల్లనున్న నష్టాలను వివరించారు.


బ్రెయిన్‌స్ట్రోక్ బాధితునికి రూ. లక్ష సాయం



బాధితుడికి సాయాన్ని అందజేస్తున్న యూడీఎఫ్ సభ్యులు

కాశీబుగ్గ: గురుదాసుపురం గ్రామానికి చెందిన బి.సూర్యం బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఉద్దాన అభివృద్ధి వేదిక 1,15,750 రూపాయలు సేకరించింది. ఈ మొత్తాన్ని వేదిక సభ్యులు బుధవారం సూర్యం చికిత్స పొందుతున్న ఆస్పత్రికి వెళ్లి అందజేశారు. వేదిక అధ్యక్షుడు సాౖర రామారావు, గౌరవ అధ్యక్షులు బత్తిన లక్ష్మణ్, సభ్యులు సాౖర జానకీరావు, కార్యదర్శి దున్న గాంధీవర్మ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు అండగా..



బాధితుడ్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: కుసుంపురం పంచాయతీ కళింగపట్నానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కర్రి రామారావు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఎమ్మెల్సీ నర్తు రామారావు కళింగపట్నం గ్రామానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. తనవంతుగా కొంత నగదును అందజేశారు. గ్రామపెద్దలు బాలయ్య, డిల్లేషు, మేఘనాథం ఉన్నారు.

బైపల్లిలో ఉచిత వైద్య శిబిరం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని బైపల్లి గ్రామంలో ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. 150 మంది బాధితులకు వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు.

ప్రాథమిక దశలోనే తెగుళ్లను గుర్తించాలి

- బాపట్ల జీడి మామాడి పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు



జీడి తోటలో తెగుళ్ల నివారణకు సూచనలు చేస్తున్న శాస్త్రవేత్తలు

వజ్రపుకొత్తూరు: జీడి మామిడిలో తెగుళ్లను ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని బాపట్ల జీడిమామిడి పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. బుధవారం పాతటెక్కలి గ్రామంలో ఉద్యానవన శాఖ సహకారంతో జీడి మామిడి, కొబ్బరి తోటల్లో యజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కీటక శాస్త్ర నిపుణులు డాక్టర్ స్రవంతి తదితరులు రైతులతో కలిసి జీడి, కొబ్బరి తోటలను పరిశీలించారు. ప్రధానంగా జూన్, జూలై నెలల్లో కొమ్మలు కత్తిరింపులు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. రసం పీల్చే పురుగు, పిండినల్లి పురుగుల నివారణకు తగు సూచనలు తీసుకోవాలన్నారు. కొబ్బరిలో కొమ్ము పురుగు నివారణకు అవసరమైన సూచనలు చేశారు. తోటల్లో లింగార్షక బుట్టలను పెట్టుకోవాలన్నారు. పలాస ఉద్యానవన శాఖ అధికారి కె.సునీత, వీహెచ్ఏలు వి.ప్రవీణ, అవినాష్, సంతోష్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులందరికీ స్థలాల కేటాయింపు



స్థలం కేటాయింపు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస మండలం బొడ్డపాడు రెవెన్యూ పరిధిలోని ఎంజిజీ లేఅవుట్–1లో 240 చదరపు గజాల ప్లాట్ల కోసం డ్రా తీసే ప్రక్రియను బుధవారం కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్కరికీ స్థలం వస్తుందన్నారు. లేఅవుట్–1లో స్థలం రానివారు ఆందోళన చెందవద్దని.. వీరికి లేఅవుట్–2లో అవకాశం కల్పిస్తారన్నారు. పది రోజుల్లో లేఅవుట్–2లో స్థలాల కేటాయింపునకు సుధా అధికారులు ఎంపికలు నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా స్థలాలకు ఎంపికైన వారికి కేటాయింపు పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాద్ అహ్మాన్ ఖాన్, సుడా పీవో అమర్‌నాథ్, ఏపీవో కృష్ణ, ఏసీపీ జానకి, జేపీవో శాస్త్రి, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు మోహన్, వెంకటేష్ పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల పదోన్నతులపై పునరాలోచించాలి



కవిటి: అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

కవిటి: గ్రామ, వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న డిజిటల్ అసిస్టెంట్లకు శాఖాపరమైన పదోన్నతలపై ప్రభుత్వం సానుకూలదృక్పథంతో పునరాలోచించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ప్రభుత్వ విప్ డాక్టర్ బి.అశోక్‌ను రామయ్యపుట్టుగలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయాల్లో గత ప్రభుత్వంలో ప్రతిష్ఠాత్మకంగా నియామకాలు పొందిన తమకు ఈ మధ్యకాలంలో ఏఎస్‌వోగా పదోన్నతి కోసం ఏర్పాటు చేసిన కమిటీ జీవోను వెనుక్కి తీసుకోవడం తగదన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా యూనియన్ సభ్యులు కె.అప్పన్న, వెంకటరమణ, పొల్లాయి అశోక్, జవహర్‌లాల్, పి.జగదీష్ ,లొల్ల విజయ్, డి.లోకేష్ ఉన్నారు.

ఇచ్ఛాపురం: తమకు న్యాయం చేయాలని కోరుతూ డిజిటల్ అసిస్టెంట్లు పలువురు నాయకులను కలిశారు. జనసేన ఇచ్ఛాపురం నియోజవర్గ ఇన్‌చార్జి దాసరి రాజును కలిసి తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. సంఘ ప్రతినిధులు పొల్లాయి అశోక్, సి.జగదీష్, లొల్ల విజయ్, డి.లోకేష్, నీరజ ఉన్నారు.

ప్రజా సమస్యలను సకాలంలో పరిష్కరించాలి



పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపిస్తున్న కృష్ణారావు

కవిటి: ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అధికారులు సకాలంలో పరిష్కరించాలని మండలంలోని వరక గ్రామ ఎంపీటీసీ సభ్యుడు పిరియా కృష్ణారావు విజ్ఞప్తి చేశారు. అత్యవసర విషయాలపై కూడా సకాలంలో స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. బిగొనపపుట్టుగలో మంచినీటి పథకం యూనిట్‌కు సంబంధించిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైందని.. ఈ విషయాన్ని సంబంధిత సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో సైతం ప్రస్తావించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఆరు నెలలుగా ట్రాన్స్‌ఫార్మర్ పని చేయకపోవడంతో నీటి సరఫరా జరగకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కిడ్నీబాధితులను డయాలసిస్ కేంద్రాలకు తరలించేందుకు 108 సేవలను తక్షణమే పునరుద్ధరించాలని కోరారు.